ప్రజాశక్తి

మంగళవారం 6 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఇకెవైసి.. పరేషాన్

◆ విశాఖ జిల్లాలో నేటికీ చేసుకోనివారు 95 వేల మంది

◆ విస్తృత ప్రచారం లేకపోవడమే కారణం



ఇకెవైసి నమోదు చేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు తప్పక ఇకెవైసి చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా ప్రచార లోపం వల్ల నేటికీ జిల్లాలో నమోదుకానివారు భారీ సంఖ్యలో ఉన్నారు. రేషన్ కార్డులో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉంటే వారందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని, మార్చి 31వ తేదీ నాటికి ఈ ప్రక్రియ జరగాలని ప్రభుత్వం గడువు విధించినా ఆశించిన స్థాయిలో ఆ పని జరగలేదు. ఎక్కువమంది ఇకెవైసి చేసుకోని పరిస్థితిని గమనించి గడువును ఏప్రిల్ 30వ తేదీకి పొడిగించినా పలు కారణాలతో నేటికీ పలువురు ఇకెవైసి చేయించుకోలేదు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం లబ్ధిదారులకు మరో అవకాశం ఇచ్చినట్టు కనిపిస్తోంది. నేటికీ విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 95 వేల యూనిట్లకు (కుటుంబ సభ్యులు) ఇకెవైసి నమోదు కాలేదు. ఇంత భారీ సంఖ్యలో నమోదు కాని పరిస్థితి ఉండడంతో మరోసారి నమోదు గడువును ప్రభుత్వం పొడిగించింది. అయితే ఇది ఎప్పటివరకూ అన్న విషయాన్ని ఇంకా స్పష్టం చేయలేదు.

అసలేం జరుగుతోంది ?

ఇకెవైసి చేసుకోకపోతే రేషన్ సరుకులు పొందటం జరగదని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు కూడా అందబోవని అంటున్నారు. ఈ విషయం తెలిసిన తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలు ఇకెవైసి చేయించుకోవడం కోసం పరుగులు తీస్తున్నారు. అయితే, కొంతమందికి ఇకెవైసి ఎక్కడ చేసుకోవాలి ? ఏ విధంగా చేసుకోవాలి ? అన్నది మిగతా 2లో..

నమోదు తప్పనిసరి

జిల్లాలో అర్హులైన వారంతా సమీపంలోని రేషన్ డిపోలు, ఎండియు ఆపరేటర్ల వద్దకు వెళ్లి ఇకెవైసి వివరాలు నమోదు చేయించుకోవాలి. లేకుంటే కార్డుల నుంచి పేర్లు తొలగించడం జరుగుతుంది. ప్రభుత్వం గడువును పొడిగించింది. ఆలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. 80 సంవత్సరాలు పైబడిన వారు ఇకెవైసి చేయించుకోవాల్సిన అవసరం లేదు.

వి.భాస్కరరావు, డిప్యూటీ సివిల్ సప్లై అధికారి



లేటరైట్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న లోకనాథం తదితరులు

లేటరైట్ తవ్వకాల లీజులను రద్దుచేయాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం వార్త మెయిన్‌లో..

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు ఆమోదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న రుణాలకు సంబంధించి 406 యూనిట్లకు ఆమోదం తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్‌సి కార్పొరేషన్ లోన్స్ యూనిట్ చైర్మన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.సత్య పద్మ, ఎల్‌ఎండి శ్రీనివాస్, బ్యాంకు కంట్రోలర్స్ హాజరయ్యారు.

లిక్విడ్ గంజాయి పట్టివేత - ఇద్దరు అరెస్టు

▶ వార్త 3లో..

చెట్టుకూలి మహిళ మృతి

▶ వార్త మెయిన్‌లో..

ఏడుగురు అధికారుల సస్పెన్షన్

▶ వార్త మెయిన్‌లో..

నల్లి ధర్మారావుకు చందు సాహితీ సంస్థ అవార్డు



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చందు ట్రస్టు ప్రతిఏటా సాహితీవేత్తలకు ఇస్తున్న ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికిగానూ ప్రముఖ రచయిత, కవి, సీనియర్ జర్నలిస్ట్, అరసం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావుకు ఇవ్వనుంది. ఈ మేరకు ట్రస్టు కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు చందు సాహితీ సాంస్కృతిక సంస్థ చైర్మన్ ఆచార్య కెఎస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు, ప్రఖ్యాత కవి, పద్మశ్రీ కొలకులూరి ఇనాక్, ప్రజాకవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రస్తుత ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సాతుపాటి ప్రసన్నశ్రీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు వంటి ఎందరో ప్రముఖులు అందుకున్నారని వెల్లడించారు. ఈ నెల 18న విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ, కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో నల్లి ధర్మారావుకు ఈ పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. రూ.10 వేలు నగదు, జ్ఞాపిక అతిథుల చేతులమీదుగా బహూకరిస్తామన్నారు.

ప్రతి నియోజకవర్గం యూనిట్‌గా అభివృద్ధి

◆ అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి ◆ తాగునీటి సమస్య లేకుండా చర్యలు

◆ జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - అనకాపల్లి

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని అక్కడి సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్టు రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షతన జిల్లా సమీక్షా మండలి సమావేశం జరిగింది. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ, వరుదు కల్యాణి, వేపాడ చిరంజీవిరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కెఎస్ఎన్.రాజు, జివిఎంసి మేయరు పి.శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు గండి బాబ్జి, మల్ల సురేంద్ర, బత్తుల తాతయ్య బాబు, పివిజి.కుమార్, ప్రగడ నాగేశ్వరరావు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, అందుకుగాను ప్రణాళికలను తయారుచేయాలని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కరెంటు కోతలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని తెలిపారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. డిస్టిలరీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలను అధికారులు అమలు చేయాలని తెలిపారు. నియోజకవర్గాలలో జరిగే పనులను శాసనసభ్యులకు తెలియజేయాలని, వారిని సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఇటీవల విడుదల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇకెవైసి.. పరేషాన్

తెలియడం లేదు. ఇది వారిలో తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం లేకపోవడం ప్రధాన లోపంగా చెప్పవచ్చు. జిల్లాలో తాజా వివరాల ప్రకారం.. మొత్తం 5,12,619 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో మొత్తం సభ్యులు 15,91,448 మంది ఉన్నారు. మార్చి 31కి 14,42,063 మంది ఇకెవైసి పూర్తి చేసుకున్నారు. 1,49,385 మంది ఇకెవైసి చేయించుకోవలసి ఉండగా ఏప్రిల్ 30 నాటికి వారిలో 55,835 మంది మాత్రమే చేసుకున్నారు. గడిచిన ఐదు రోజుల్లో 2500 మంది చేసుకున్నట్టు ఒక అంచనా. ఈ లెక్కన 95 వేల మంది ఇంకా చేయించుకోవాల్సి ఉంది. పిల్లలు, వృద్ధులు, వేలిముద్రలు పడని వారు ఇకెవైసికి తీవ్ర అయోమయ పరిస్థితికి గురవుతున్నారు. సచివాలయాలు, మీసేవ, ఆధార్ నమోదు కేంద్రాలు వద్దకు ఇటువంటివారు వెళుతూ ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క సర్వర్ పనిచేయని పరిస్థితులు కూడా ఉన్నాయి.

గ్యాస్ సబ్సిడీకి కూడా ఇకెవైసి ఉండాల్సిందే

ఇదిలా ఉండగా వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నప్పుడు ప్రభుత్వం ఇస్తానన్న పూర్తి సబ్సిడీ సొమ్ము పొందాలంటే ఇకెవైసి ఉండాలని ప్రభుత్వం ఈసరికే ప్రకటించింది. మార్చి 31లోగా గ్యాస్ బుక్ చేసుకున్న వారికి పూర్తి సబ్సిడీని ఇవ్వనున్నట్టు తెలిపింది. అయితే ఆ తేదీలోగా గ్యాస్ బుక్ చేసుకున్న అనేక మందికి సబ్సిడీ సొమ్ము అందలేదు. దీనికి కారణం అటువంటివారు ఇకెవైసి చేయించుకోకపోవడం, బ్యాంకు ఖాతా నెంబర్ ఇవ్వకపోవడమేనని తెలుస్తోంది. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 8,90,345 మంది గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్నారు. ఇందులో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నవారు 5,12,619 మంది ఉన్నారు.

ప్రతి నియోజకవర్గం యూనిట్‌గా అభివృద్ధి

చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత ఏడాది 12వ స్థానంలో ఉన్న పదో తరగతి ఫలితాలు ఈ ఏడాది ఐదో స్థానానికి చేరుకోవడం, అలాగే ఇంటర్మీడియట్‌లో ఫస్ట్ ర్యాంకు రావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాను అన్ని విధాల ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ప్రతిసారి కొన్ని అంశాలపై ప్రత్యేకంగా చర్చించాలని తెలిపారు. పాడైన బోర్ల స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మంచినీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా జిల్లాలో ప్రత్యేక మోనిటరింగ్ సెల్ ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని తెలిపారు. వెహికల్ ఫిట్‌నెస్ సెంటర సబ్బవరంలో ఏర్పాటుచేయడం వల్ల నర్సీపట్నం పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నర్సీపట్నంలో కూడా వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గోవాడ చక్కెర కర్మాగారం రైతులకు వెంటనే బకాయిలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

యువత సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రమిస్తోందని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి, 6100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ, రూ.8.5 లక్షల కోట్లు పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా 5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఎపిపిఎస్‌సిని నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలబడేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వైసిపి హయాంలో యువత నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆ క్రమంలో నిరాశ నిస్పృహతో బెట్టింగ్, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడి ఉజ్వలమైన భవిష్యత్తును అంధకారం చేసుకున్నారని పేర్కొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జీవవైవిధ్య పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. సోమవారం ఎంవిపి కాలనీ ఉషోదయ జంక్షన్‌లో పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెలలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా దేశీయ పండ్ల విత్తనాలు సేకరించాలని కోరారు. ఆ విత్తనాలతో విత్తనబంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంచాలని కోరారు. విశాఖ మహానగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు, తమ దగ్గర ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కోరేవారు 8333849955 నెంబర్‌కు తమ వివరాలను వాట్సాప్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారిణి పూర్వీరజాక్ ఉపాధ్యాయులు పి.రాధాకష్ణ, గ్రీన్ వాలంటీర్లు జె రాజేశ్వరి, ఐ.కష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్ల నిర్మాణ దిశగా అడుగులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మధ్యతరగతి కుటుంబాల సొంత ఇంటి కలలను తీర్చడానికి అన్ని సౌకర్యాలతో కూడిన ఎంఐజి బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్‌లను విశాఖపట్నంలో అభివృద్ధి చేసే దిశగా విఎంఆర్‌డిఎ అడుగులు వేస్తోందని, ఈ సందర్భంగా కొనుగోలుదారుల నుంచి వారి ప్రాధాన్యతలను, ఏ ప్రాంతాలలో నిర్మించాలో తెలుసుకునేందుకు వారినుండి ఆసక్తి వ్యక్తీకరణ సర్వే చేపడుతున్నామని ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

దెయ్యాలమెట్టపై తవ్వకాలు తగవు

◆ అనుమతులను రద్దు చేయాలి
◆ కలెక్టర్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆనందపురం మండలం ఇచ్ఛాపురం గిరిజన గ్రామం సమీపంలోని దెయ్యాలమెట్ట కొండ సర్వే నెంబర్ 37లో తక్షణమే తవ్వకాల అనుమతులను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సిపిఎం కోరింది. ఈ మేరకు ఆయనకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సోమవారం లేఖ రాశారు. దెయ్యాలమెట్ట కొండ సుమారు 400 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని, దీనిలో 15 ఎకరాలు క్వార్ట్‌జైట్ నిక్షేపాల వెలికితీత, క్వారీయింగ్‌కు రాష్ట్ర డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ డిపార్ట్‌మెంట్ అగ్ని సుముఖ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రైవేట్ సంస్థకు 20 సంవత్సరాలకు అనుమతులు ఇచ్చిందని తెలిపారు. వాటిని తక్షణం రద్దు చేయాలన్నారు. గనులు వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే వాతావరణంలో ప్రతికూల మార్పులు సంభవించి ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో కీలకంగా ఉన్న కొండలను ధ్వంసం చేయడం మరింత ముప్పునకు దారితీస్తుందన్నారు. ఇచ్ఛాపురం గిరిజన గ్రామ ప్రజలతోపాటు ఈ కొండ చుట్టూ ఉన్న అనేక గ్రామాల ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. వ్యవసాయ భూములు, పంటతోటలు, చెరువులు, భూగర్భ జలాలు కలుషితమవుతాయన్నారు. గాలి కాలుష్యం వల్ల ప్రజలు రోగాల బారినపడతారన్నారు. పశు సంపద, వన్యప్రాణులకు హాని జరుగుతుందన్నారు. ప్రభుత్వ చర్యతో ప్రజలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. ఇదే మండలంలోని చిన్నయ్యపాలెం సర్వే నెంబరు 104లో క్వార్ట్ జైట్, రఫ్ స్టోన్, గ్రావెల్ తవ్వకాల కోసం ప్రభుత్వం అనుమతులిచ్చేందుకు ప్రయత్నిస్తే ప్రజాభిప్రాయ సేకరణలో పరిసర గ్రామాల ప్రజలు ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించిన విషయాన్ని గుర్తుచేశారు.

ఇప్పుడు గిరిజన ప్రాంతం ఇచ్ఛాపురం దెయ్యాలమెట్ట కొండను ధ్వంసం చేయడానికి పూనుకోవడం ప్రభుత్వానికి తగనిపని అన్నారు. ఈ మైనింగ్ వల్ల పర్యావరణానికి, ప్రజలకు, జీవజాతికి తీవ్రహాని జరిగే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. కనుక వెంటనే కలుగజేసుకోవాలన్నారు.

ఉక్కు పరిరక్షణకు కడదాకా పోరాటం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ చేపట్టిన ఉద్యమం కడదాకా సాగుతుందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్ కుమార్ అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన విశాఖ ఉక్కు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరం వద్ద సోమవారం కార్ల్ మార్క్స్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మజ్జిగ పంపిణీ చేశారు. మహనీయుల స్ఫూర్తితో ఉక్కు పోరాటాన్ని యువతరం ముందుకు తీసుకువెళ్తుందన్నారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు ప్రారంభించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె.గణేష్, శ్రీను, ఉమా శైలజ, ఎర్రి బాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి నెలకొల్పాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: పెందుర్తి మండలం చిన ముషిడివాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో తొలగించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులే తిరిగి ఏర్పాటు చేయాలని ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మి, భీమ్‌సేన్‌వార్ అధ్యక్షులు కె.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చినముషిడివాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీకి చెందిన దళిత బహుజన పేదలు పలుమార్లు కాలనీలో బుర్రా రాజేష్‌అనే వ్యక్తి భూ దురాక్రమణలకు పాల్పడుతున్నారని, దళిత మహిళలను కులం పేరుతో దూషించి భౌతికదాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశామన్నారు. కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పార్కు నిర్మించాలని భావించారన్నారు. అదేస్థలాన్ని బుర్రరాజేష్ ఆక్రమించాడని అయినా అధికారులు పట్టించుకోలేదన్నారు.

విద్యుత్ ఒప్పందాల్లో భారీ కుంభకోణం



మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వం యాక్సిస్ సంస్థతో తాజాగా చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో రూ.11 వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వెనుక సిఎం చంద్రబాబు అవినీతి చాలా స్పష్టంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. గత వైసిపి ప్రభుత్వం యూనిట్‌ను రూ.2.60కి కొనుగోలు చేస్తే గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఈ రోజు యూనిట్‌ను రూ.4.60కి ఎలా కొనుగోలు చేస్తున్నారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రజాసమస్యల పరిష్కారవేదిక లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలను విని వెంటనే శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు.

కలెక్టర్ పిజిఆర్ఎస్ నిర్వహణ స్వర్ణాంధ్ర లక్ష్య సాధన, పి4సర్వే, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌నకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్జీ పునరావృతమైతే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సమస్యలపై ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ 257 ఆధ్వర్యాన సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.కరుణాకరరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోందని, దశాబ్దాల నుంచి అమలులో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాల అంటే 1 నుంచి 5 తరగతులతో మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికే ఉనికిలో ఉన్న 6 నుంచి 10 లేదా 12 తరగతులుగా ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం రెండు ఎస్‌జిటి పోస్టులు ఉండేలా చర్యలు చేపట్టాలని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని, 12వ పిఆర్‌సిని వెంటనే నియమించి, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎ లను తక్షణమే ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకాయిలతో పాటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక పరమైన బకాయిలను చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, భీమిలి అర్బన్ శాఖ అధ్యక్షులు ఆర్.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చిప్పాడ మోహన్‌కృష్ణ, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల యూనియన్ అధ్యక్షులు కె.సన్యాసినాయుడు, గంగాధరరావు, పెద్దరాజు, శ్రీను పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కరుణాకరరావు

నైపుణ్యాభివృద్ధికి ఎఐటిఇతో ఎన్ఎస్ఆర్ఐటి ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం కోసం ఎఐటిఇతో ఒప్పందం చేసుకున్నామని ఎన్ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ శంభుప్రసాద్ తెలిపారు. మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ -ఎఐటిఇ ఎడుస్కిల్స్ మధ్య ఒప్పందం జరిగినట్లు వివరించారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు తగ్గట్లు సిద్ధం చేయడం ద్వారా వారిలో ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించుతాయని తెలిపారు. తద్వారా అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వర్క్‌షాపులు, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్ కోర్సులు వంటి పలు అవకాశాలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాని తెలిపారు. పరిశ్రమ-విద్యా రంగ భాగస్వామ్యాలను బలోపేతం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఎన్ఎస్ఆర్ఐటి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ డాక్టర్ పిఎస్.రాజు, సెక్రటరీ డాక్టర్ ఎన్.ప్రసాదరాజు, ఎఐటిఇ ఎడుస్కిల్స్ సిఇఒ పాల్గొన్నారు.

వారసత్వ భూములను ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏళ్ల తరబడి తమ అనుభవంలో ఉన్న వారసత్వ భూములను ఆన్‌లైన్‌లో పొందుపరిచి తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని తాటితూరు గ్రామ పంచాయతీకి చెందిన పలువురు రైతులు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం గ్రామంలో రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో తమ అనుభవంలో ఉన్న వార సత్వ భూములను ఆన్‌లైన్ చేయడం ద్వారా తమ కుటుంబాలకు న్యాయం చేసిన వారవుతారని వినతి పత్రంలో పేర్కొన్నారు. జివిఎంసి 4వ వార్డు పరిధి నేరెళ్లవలస రాజీవ్‌గృహ కల్ప గృహ సముదాయంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పలు ఇళ్ల మధ్య దట్టంగా పెరిగిన తుప్పలను తొలగించాలని కోరుతూ స్థానికులతో కలిసి జెడిసి బమ్మి అయ్యప్పనాయుడుకు సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి వినతి పత్రం అందజేశారు. రోడ్డును మరమ్మతు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానికులు అన్నాబత్తుల నరసింగరావు, కృష్ణ, బాలాజీ, సురేష్ తదితరులు ఉన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 3, రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, యుసిడి విభాగానికి సంబంధించి 1 అర్జీలు అందాయి. వీటిని తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు జెడిసి తెలిపారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ అంబేద్కర్ ఇండియన్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సోమవారం తహశీల్దార్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి శివ మాట్లాడుతూ, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సేవలు మరువలేనివన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రతి గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటుచేయడం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో దలాయి శివ, చల్లా రామిరెడ్డి, దుక్క సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి సంతపాలెం సామాజిక భవనంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యాన సోమవారం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా తరగతులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 90 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులను క్రమం తప్పకుండా హాజరై శ్రద్ధతో నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. అందరూ గ్రూపులుగా ఏర్పడితే పాఠశాలలు, హాస్టల్ విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే కాంట్రాక్టును ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, నాయకులు ఒమ్మి అప్పలరాజు, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, బసవ దేవుళ్ళు, ముగడ రాజారావు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

11న గీతం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2025) ను దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 42 పట్టణాలలో నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరెక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో గీతం వెబ్‌సైట్ ద్వారా మే 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గీతం ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని, ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందజేస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -మధురవాడ : చందనోత్సవంలో సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల కుటుంబాన్ని సిపిఐ, ఎఐటియుసి నాయకులు సోమవారం పరామర్శించారు. మధురవాడ చంద్రంపాలేనికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ దంపతుల మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేస్తూ కుటుంబానికి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, నాయకులు అత్తిలి విమల, ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మధ రావు, వి.సత్యనారాయణ, ఎమ్‌డి.బేగం, పివి.అప్పారావు, ఎం.బంగారయ్య, సిహెచ్.కాసుబాబు తదితరులు ఉన్నారు.

అనంత పద్మనాభస్వామికి పట్టు వస్త్రాలు వితరణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలోఉన్న శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర టిడిపి మహిళా ఉపాధ్యక్షులు కె.లీలావతి సోమవారం పట్టు వస్త్రాలు వితరణగా ఇచ్చారు. ఈ మేరకు కుంతీమాధవస్వామి ఆలయంలో ఉన్న పురోహితులకు అందజేశారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న లీలావతి తదితరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి సర్వీస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దిపాలెం గ్రామానికి చెందిన శీలా శ్రీను (49) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... పెద్దిపాలెం గ్రామం రామాలయం వీధికి చెందిన శీలా శ్రీను కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం రాత్రి కూలి పనులు ముగించుకుని సైకిల్‌పై ఆనందపురం నుంచి పెద్దిపాలెం వస్తుండగా వెల్లంకి సర్వీస్ రోడ్డులో ఆటో ఢీకొట్టింది. బలమైన గాయాలైన శ్రీనును ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుమార్తె శీలా భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ శివ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి నమ్మివానిపేటలో ఓ వ్యక్తి సోమవారం విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం విజయనగరం పూల్ బాగ్ కాలనీకి చెందిన ఆవాల ఎర్రయ్య (42) చిన్న కుమారునికి ఆరోగ్యం బాగాలేదు. ఊపిరితిత్తుల సమస్య ఉందని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న ఎర్రయ్య కుమారుని ఆరోగ్యం ఎలా కుదుట పడుతుందోనని ఆందోళన చెంది విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని నచ్చ జెప్పారు. దీంతో విద్యుత్ స్తంభంపై నుంచి దిగి ఆత్మహత్యాయత్నాన్ని విరమించుకున్నాడు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాల సమీపంలో ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రాంబాబును వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రాంబాబు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. రాంబాబు ఫోన్‌లో నెంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాంబాబు భార్య కరి లక్ష్మి చిన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోలో మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి వికలాంగుల కాలనీలో రోడ్డుపై పార్కింగ్ చేసి ఉన్న ఆటోలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు ఆటోలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. గాంధీనగర్‌కు చెందిన నక్కా స్వామి(40)గా గుర్తించారు. ఆదివారం సాయంత్రం నక్కా స్వామి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సోమవారం తెల్లవారు జామున ఆటో సీటు నుంచి ఆటోలోనే కింది బోర్లా పడి ఉన్నాడు. ముక్కుకు గాయం కూడా ఉంది. మద్యం తాగి మత్తులో కింద పడిపోయి, ఊపిరి ఆడక మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

లిక్విడ్ గంజాయి పట్టివేత : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చెయ్యపేట గ్రామ శివారు అయితంపూడి జంక్షన్‌కు సమీపంలో సోమవారం ఉదయం ఇద్దరు వ్యక్తుల ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. వడ్డాది గ్రామానికి చెందిన వీర్ల నారాయణమూర్తి, రావికమతంకు చెందిన గెంజి సతీబాబులు మోటార్ సైకిల్‌పై రెండున్నర కిలోల లిక్విడ్ గంజాయిని తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో పోలీసులు అయితంపూడి జంక్షన్ వద్ద కాపుకాసి పట్టుకున్నారు. వారి నుండి లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,45,500 ఉంటుందని అంచనా. కార్యక్రమంలో హెచ్‌సి జె.అర్జున్, గణేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులతో పోలీసులు

ఉత్సాహంగా మేడే వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి బిఎన్ఆర్.నగర్‌లో సిఐటియు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యాన మేడే ఉత్సవాలను నిర్వహించారు. కళాకారులు నృత్య రూపక ప్రదర్శనలిచ్చారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సభలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలు, కనీసవేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్, కంపెనీ చట్టాలను కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలు, హక్కులను యజమానులకు అనుకూలంగా మార్చుతోందని చెప్పారు. ఈ హక్కుల రక్షణ కోసం అఖిలభారత కార్మిక సంఘాలు ఐక్యంగా ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు ప్రజలు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, డి.నాగరాజు, పి.శంకర్, రమణ, డి.కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



సభనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

ఆటోనగర్ డి బ్లాక్‌లో మంటలు



డంపింగ్‌యార్డుకు నిప్పుపెట్టడంతో అలుముకున్న దట్టమైన పొగ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ డి బ్లాక్‌లోని అన్నా క్యాంటీన్ పక్కన డంపింగ్ యార్డులో సోమవారం దట్టమైన పొగతో కూడిన మంటలు వ్యాపించాయి. విపరీతమైన పొగ రావడంతో ఆటోనగర్‌లో ఉన్న కార్మికులు, కుంచమాంబ కాలనీ, సమైక్య అపార్ట్‌మెంట్‌తో పాటు, వివిధ అపార్ట్‌మెంట్ ప్రజలు భయాందోళన చెందారు. వాస్తవానికి ఈ డంపింగ్ యార్డులోని చెత్తను నెలకు ఒకసారి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేలా కాంట్రాక్టర్‌తో ఒప్పందం ఉంటుంది. కానీ సంబంధిత కాంట్రాక్టర్ ట్రిప్పులకు ఆశపడి చెత్తను కాల్చడం వల్ల ప్రతి మూడు నెలలకోసారి ఈ విధమైన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఐలా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తరచూ చెత్తను తగులబెట్టే పనిచేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా దట్టమైన పొగరావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నాలుగు గంటలకు ఐలా కమిషనర్ కిషోర్ వాటర్ ట్యాంక్‌ను పంపించి మంటలను అదుపు చేయించారు.

దీనిపై ఐలా కమిషనర్ కిషోర్‌ను ప్రజాశక్తి ప్రశ్నించగా వాస్తవానికి డంపింగ్ యార్డులో చెత్తను కాల్చరాదని చెప్పారు. డంపింగ్ యార్డు తాళం తీసి ఉండడాన్ని చూసిన వీధుల్లో చెత్త ఏరుకొనే వ్యక్తులు వెళ్లి నిప్పు పెట్టారని చెప్పారు. ఇక నుంచి తాళం వేస్తామని, ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేసి, మళ్లీ లోడింగ్‌కు వెళ్తున్న సమయంలో వీధిలో తిరిగే వారు ఈ పని చేశారని వివరించారు.

వికలాంగులకు ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మధురవాడ : బక్కన్నపాలెంలోని ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ (ఐటిఐ శిక్షణ, ఉత్పత్తి కేంద్రం) పురుష వికలాంగ యువత నుంచి ఈ విద్యాసంవత్సరం (2025-26)లో ఐటిఐ ట్రేడుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్పెంటర్, వెల్డర్ (గ్యాస్, ఎలక్ట్రికల్)కు పదోతరగతి (పాస్/ఫెయిల్), షీట్‌మెటల్‌కు పదోతరగతి ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఈ మూడు ట్రేడుల్లో శిక్షణ పొందేందుకు అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు iti.apgov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలను 25, 26 తేదీల్లో పరిశీలించి జూన్ 2 నుంచి 10వ తేదీ మధ్య కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ సిహెచ్.భాస్కరరావు (73964 24319), (95021 23060)ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు పత్రంతో పాటు విద్యార్హత, టీసీ, స్టడీ, నివాస, కుల, ఆదాయ, మెడికల్ సర్టిఫికెట్ (సదరం), ఆధార్, రేషన్‌కార్డు నకళ్లతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఈ-మెయిల్, ఫోన్‌నెంబర్ సైతం పొందుపర్చాలని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారికి భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : హయ్యర్ పెన్షన్ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రెటరీ జి.గణపతిరెడ్డి డిమాండ్‌చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అసోసియేషన్ సమావేశం పెద గంట్యాడలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి మూడేళ్లు అవుతున్నా హయ్యర్ పెన్షన్ విషయంలో ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. 30 సంవత్సరాలు సర్వీస్ చేసిన కార్మికుడికి చాలా తక్కువ పెన్షన్ వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని కోరారు. భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించాలని, ట్రైన్ ప్రయాణంలో 50 శాతం రాయితీ, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు జె.అప్పస్వామి, కె.దీనబంధు, బెల్లాల నాగేశ్వరరావు, నమ్మి అప్పలనాయుడు, కాకినాడ పెంటారావు, నడిపూడి వెంకట్రావు, బి.గురప్ప, శెట్టి అప్పారావు, కాకినాడ సింహాసనం, ఎన్‌వి.రమణ, ద్వారపూడి గురునాథ్, పాల వెంకయ్య, నక్క అప్పారావు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకులకు అభినందనలు

ప్రజాశక్తి -ములగాడ : పరిశోధనా పద్ధతులపై ఈ నెల 16నుంచి 30వ తేదీ వరకు అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించిన ఐఎన్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవిలను సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వీరిద్దరూ ఆన్‌లైన్‌లో రోజుకు రెండు గంటలు చొప్పున మొత్తం 30 గంటల పాటు శిక్షణలో పాల్గొని, పలువురి ప్రశంసలు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని, అనసూయను అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.

ఘనంగా తోలేళ్ల సంబరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి ప్రశాంతినగర్‌లోని శ్రీ పైడితల్లి అమ్మవారు పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలయ ధర్మకర్త గణబాబు ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం గోపాలపట్నం నూకాలమ్మ ఆలయం నుంచి తోలేళ్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను గణబాబు, ఆయన కుటుంబ సభ్యులు, భక్తులు శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కన్వెన్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో విఎంఆర్‌డిఎ నిధులు సుమారు రూ.6.24 కోట్లతో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను సోమవారం అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కన్వెన్షన్ సెంటర్‌ను అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపి ఆయిల్ సీడ్స్ ఛైర్మన్ గండి బాబ్జి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బల్ల శ్రీనివాసరావు, అధికారులు రమేష్, ఎన్.సుధీర్, శిరీష, సింధుజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. మర్రిపాలెం ఉడా లే అవుట్ ప్రాంతంలో ఆర్ అండ్ బి జంక్షన్ సమీపంలోని లలిత డిలైట్ గ్రీన్ బెల్ట్, వనితా వాకింగ్ ట్రాక్, పాస్ పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు, వాటర్ సప్లై తదితర అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అనంతరం ఉడా లే అవుట్‌లో నిర్మిస్తున్న శివాలయం దగ్గర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ అనూప్, ఎలక్ట్రికల్ ఏఈ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామానికి చెందిన శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యాన సోమవారం నిరుపేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర లారీ ట్రాన్స్‌పోర్టు, ఇటుక బట్టి ఓనర్ మజ్జి చిన్నారావు, రూప్నీ దంపతుల కుమార్తె ధనుశ్రీ పుట్టినరోజు సందర్భంగా కొంతమంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కోన సన్యాసినాయుడు, కార్యదర్శి పద్మనాభస్వామి, సహాయ కార్యదర్శి కంది సత్యనారాయణ, పూర్వ ఉపాధ్యక్షులు మరగడ చిరంజీవి, మెంబర్స్ ఒమ్మి పైడినాయుడు, బల్ల మధు, సీర కనకరాజు, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు జెర్సీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జూన్ 5వ తేదీ వరకు ఫుట్‌బాల్ క్రీడాకారులకు (బాలురు) నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి 35 మంది క్రీడాకారులకు జెర్సీలు, బాల్స్ అందజేశారు. స్థానికులైన రేలంగి చినబాబు సొంత నిధులతో రోజూ క్రీడాకారులకు గుడ్లు, పండ్లు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ పి.సీతారామరాజు, నిర్వాహకులు చంద్రశేఖర్, రాజా, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మాస్టారుకు సన్మానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపల్లి సత్యనారాయణను సోమవారం మండలంలోని మూలకుద్దు ఎంపిపి పాఠశాలలో సన్మానించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ గంటాన మోహనరావు, పాఠశాల హెచ్ఎం దాలయ్యబాబు, చిప్పాడ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు రేఖ అప్పారావు తదితరులు సన్మానం చేశారు. విద్యార్థులు, మూలకుద్దు గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 51వ వార్డు టిడిపి కార్యాలయంలో పార్టీ వార్డు అధ్యక్షుడు సనపల కీర్తి ఆధ్వర్యాన కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీచేశారు. కార్యక్రమంలో తాతినేని శ్రీనివాసరావు, జయరాజ్, బొడ్డేపల్లి లలిత, రాజు, మూల అప్పారావు, ధవళకుమారి, చౌదరి, జగన్, ప్రమీల, లలిత, సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీలో సనపల కీర్తి తదితరులు

దాసరికి నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు సినిమా దర్శకులు దాసరి నారాయణరావు 78వ జయంతిని తెలుగు సినిమా డైరెక్టర్స్ దినోత్సవంగా నిర్వహించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హెల్ప్ లండన్ సంస్థలు సంయుక్తంగా సోమవారం పౌర గ్రంథాలయం సొసైటీ అధ్యక్షులు కాశీవిశ్వేశ్వరరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దాసరి నారాయణరావు చిత్రపటానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, దర్శకులు మీగడ శివశ్రీ, మీగడ రామలింగస్వామి, బి.ఎం.నాయుడు, నిర్మాత రఘురామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సెకండ్ ఇన్నింగ్స్, ప్రావీణ్యామృతం లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, దాసరి నారాయణరావు గొప్పతనాన్ని వివరించారు. సినీ దర్శకులకు గౌరవాన్ని తీసుకొచ్చారని, ఆయనొక ఫిల్మ్ విశ్వవిద్యాలయం అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బి.చిన్నారావు, హుస్సేన్, డాక్టర్ బాబ్జి, చాట్ల బాబూరావురెడ్డి పాల్గొన్నారు.

చిల్లర వర్తకుల ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : సమస్యలపై చిల్లర వర్తకులు సోమవారం నరసింహనగర్ రైతు బజార్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ఫుట్ పాత్, తోపుడు బండ్ల కార్మికుల సంఘం (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ, రైతు బజార్ వద్ద షాపులు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిల్లర వర్తకులకు జివిఎంసి ఫొటో గుర్తింపు కార్డులు, ముద్ర రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వం నిర్మించిన ఇళ్లలో చిల్లర వర్తకులకు రెండు శాతం కేటాయించాలని డిమాండ్‌చేశారు. సంఘం అధ్యక్షులు కె.ప్రకాష్ మాట్లాడుతూ, జిల్లాలో వందల మంది చిల్లర వర్తకులకు సామాజిక భద్రత కల్పిస్తూ సంక్షేమ చట్టం చేయాలని, అక్రమంగా వసూలు చేస్తున్న ఆశీలను రద్దు చేయాలని, వ్యక్తిగత బ్యాంకు రుణాలు మంజూరు చేసి చిల్లర వర్తకులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కేలం శివ, కె.శ్రీనివాస్, పి.సూర్యారావు, పి.సాయికుమార్, కె.గణేష్, పి.అనీల్, యు.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు సంగివలసలో ఇటీవల ప్రారంభమైన కోల వెంకటరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. తుది మ్యాచ్‌లో గొల్లల తాళ్లవలస జట్టు విన్నర్‌గా నిలిచి రూ.30 వేలు, చిల్లపేట జట్టు రన్నర్‌గా నిలిచి రూ.20 వేలు, లొడగలవానిపాలెం జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.5 వేలు బహుమతిని గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన స్థానికులు అక్కరమాని మంగరాజు, గంటా నూకరాజు, కొక్కిరి అప్పన్న చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. నిర్వాహకులు త్రినాథ్, గిరి పాల్గొన్నారు.

జివిఎంసి ఉద్యోగి పాలవెల్లి మృతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం ఉద్యోగి గోగాడ పాలవెల్లి సోమవారం మృతి చెందారు. ప్రస్తుతం చార్‌ధాం యాత్రలో ఉన్న ఆయన అక్కడ అస్వస్థకు గురై మృతిచెందారు. ఆయన పార్థివదేహం సోమవారం రాత్రి 9 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందని, అక్కడి నుంచి రాజీవ్ నగర్‌లోని స్వగృహానికి తరలించనున్నట్లు బంధువులు తెలిపారు.



పరిశ్రమల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు



ఎస్ఇజెడ్ పరిశ్రమలకు సమ్మె నోటీసులు ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలిలోని పలు పరిశ్రమల ప్రతినిధులకు సమ్మె నోటీసులను సిఐటియు ప్రతినిధులు అందజేశారు. అధిష్టాన్, పిల్ కింగ్టన్, విన్విన్, పోకర్నా తదితర పరిశ్రమ యజమానులకు ఈ నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, నాయకులు బ్రహ్మాజీ పాల్గొన్నారు.

జివిఎంసిలో సమ్మె నోటీసు అందజేత

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 20న సమ్మె చేస్తున్నట్టు తెలుపుతూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన జివిఎంసి ప్రధాన హెల్త్ ఆఫీసర్కు సోమవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ను రద్దు చేయాలన్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఆలోగా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఆప్కాస్ రద్దు చేయకుండా దానిలోని లోపాలను సరిదిద్దాలని కోరారు. స్థానిక సమస్యలనూ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, నాగరాజు, గణేష్, ఎం.ఈశ్వరరావు, వరలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.



జివిఎంసి హెల్త్ ఆఫీసర్కు సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నేతలు

20న సమ్మెను జయప్రదం చేయాలని ర్యాలీ

కంచరపాలెం : నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని, పాత కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన చేపట్టే సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు సోమవారం ఎన్ఎడి జంక్షన్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎడి ఫ్లైఓవర్ నుంచి కరాస పెట్రోల్ బంక్ వరకు, తిరిగి ఎన్ఎడి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు కంచరపాలెం జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు, నాయకులు ఎస్.శ్రావణ్కుమార్, ఎ.అప్పలరాజు, వి.మహేశ్వరి, అప్పలసూరమ్మ, గౌరి, కనక, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కంచరపాలెంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

సమ్మె బుక్లెట్ ఆవిష్కరణ

కె.కోటపాడు : లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ మే 20న జరుగు సమ్మెను జయప్రదం జప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఈ.నాయుడు బాబు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన బుక్ లెట్ను సోమవారం విడుదల చేశారు. స్కీంవర్కర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పంచాయతీ, ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయన బాబు, ఎర్ర దేముడు, వనము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సిహెచ్ఓలు

8వ రోజుకు సిహెచ్ఓల సమ్మె

- మోకాళ్లపై వినూత్నంగా నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్ఓ)లు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 8వ రోజుకు చేరింది. నెహ్రూ చౌక్ జంక్షన్ ఎన్టిఆర్ వద్ద నిరసన శిబిరంలో సిహెచ్ఓలు మోకాళ్ళపై వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిహెచ్ఓలను పిలిచి చర్చలు జరిపి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. సిహెచ్ఓలను నేటి వరకు చర్చలకు పిలవకుండా ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సిహెచ్ఓలను ఆరేళ్లకే పర్మినెంట్ చేస్తామని, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమానంగా వేతనం, జాబ్ చార్ట్ తదితర డిమాండ్లు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సిహెచ్ఓలతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేవతి, భవాని, సంధ్య, సిహెచ్ఓలు పాల్గొన్నారు.

అలరించిన లాఫింగ్ క్లబ్ కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పార్క్ సెంటర్ వద్ద ఉన్న శ్రీమళ్ళ జగన్నాథం కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమాలు అత్యంత రసరమ్యంగా ఆకట్టుకున్నాయి. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దాడి వాసు, బొడ్డేడ మురళి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జబర్దస్త్ సత్తిపండు, ఎఫ్ఎం బాబాయ్ విచ్చేసి తమ హాస్యంతో నవ్వించారు. అనంతరం అనకాపల్లి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన హైదరాబాద్ జబర్దస్త్ టీం వారిచే నవ్వుల నజరానా స్కిట్లు హాస్య ప్రియులందరినీ అలరింపజేశాయి. కార్యక్రమంలో సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్, ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ అధినేత డాక్టర్ వెంకట పార్వతీశం, లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వినకోట బుచ్చిరాజు, కొణతాల పూర్ణచంద్రరావు, విల్లూరి సంతోష్ కుమార్, రాపేటి నారాయణరావు, ఉద్దగిరి శ్రీనివాసరావు, భీమరశెట్టి వరాహ దాడి సూరిబాబు, దావన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని గర్శింగి పంచాయతీ పరిధి తాటిపూడి సమీపంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఆక్రమణులకు గురైన భూములను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం అనంతరం అయిన విలేకరులతో మాటాడారు. గర్శింగి రెవెన్యూ పరిధి ఎల్పిఎం నెంబర్లు 49లో 11 సెంట్లు, 78లో 16 సెంట్లు, 70, 69, 45, భూమి, గెడ్డ వాగు ఆక్రమణకు గురైనట్లు అధికారులు రెవిన్యూ గణాంకాల్లో వెల్లడించారని తెలిపారు. జిరాయితీ భూమికి అనుకొని ఉన్న మిగిలిన ప్రభుత్వ బంజరు, గెడ్డ, వాగు, పోరంబోకు, కొండ పోరంబోకు భూముల్లో ఇష్టానుసారంగా రాళ్లను, బండలను నిబంధనలకు విరుద్ధంగా పేల్చేసి, ఆ భూస్వరూపాన్ని పూర్తిగా మార్చివేశారని, పోల్స్ వేసి ఇష్టానుసారంగా హద్దులు మార్చివేశారని తెలిపారు. భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్కు నెల రోజులు క్రితమే ముఖ్యమంత్రి అదేశాలిచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల దెబ్బకు గెడ్డలు పూర్తిగా అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ముందస్తు ప్రణాళిక ప్రకారమే ప్రభుత్వ భూములను ఆనుకుని జిరాయితీ భూములను కొనుగోలు చేశారని, అనంతరం ఆ ప్రభుత్వ భూములను ఆక్రమించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.



ప్రభుత్వ భూములు ఆక్రమణను గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వెంకన్న

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లిలో గత 12 రోజులుగా జరుగుతున్న దేవరాపల్లి ప్రీమియర్ లీగ్ (డిపిఎల్) సీజన్-2 క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో మండలం నుంచి ఆరు జట్లు పాల్గొనగా, నాని, నరేష్ జట్లు ఫైనల్కు చేరుకున్నాయి. సోమవారం ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్లో నాని జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకొని 10 ఓవర్లలో 83 పరుగులు చేసింది. 84 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నరేష్ జట్టు నిర్ణీత ఓవర్లలో 83 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. దీంతో సూపర్ ఓవర్ మ్యాచ్ నిర్వహించగా, నరేష్ జట్టు 6 బంతుల్లో 8 పరుగులు చేయగా, నాని జట్టు నాలుగు బంతుల్లోనే 9 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి రూ.15000, ద్వితీయ బహుమతి రూ.12000, ట్రోఫీలను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, గొళ్ల రామ్మూర్తి చేతుల మీదుగా అందజేశారు. కిలపర్తి భాస్కరరావు, లలిత నాయుడు, డాక్టర్ సింహాచలం నాయుడు, ఎల్ఐసి రమణ, గండిపడాల అప్పలరాజు, వాసవి సెల్ పాయింట్ తదితరులు ఆర్థిక సహాయంతో ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు పెదిరెడ్ల బాలు, చిత్రాడ సతీష్, సిహెచ్ నాని తెలిపారు.

పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శిగా డాక్టర్ గంగాధర్

ప్రజాశక్తి-యలమంచిలి : పశుసంవర్ధక శాఖ విశాఖ ఉమ్మడి జిల్లా ఆఫీసర్స్ సంఘం కార్యదర్శిగా డాక్టర్ చల్లా గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ ఆధ్వర్యాన సోమవారం జరిగిన సంఘం ఎన్నికల్లో అధ్యక్షులుగా ఆర్.సింహాద్రప్పు, కార్యదర్శిగా డాక్టర్ గంగాధర్, కోశాధికారిగా అనకాపల్లి ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బి.సౌజన్య ఎన్నికయ్యారు. డాక్టర్ చల్లా గంగాధర్ యలమంచిలి ఏరియా వెటర్నరీ హాస్పిటల్ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న చేస్తున్నారు. విశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కరుణాకర్, అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్రావు డాక్టర్ గంగాధర్కు అభినందనలు తెలిపారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

కూటమి ఏడాది పాలనలో చేసింది శూన్యం

- ప్రభుత్వంపై తిరుగుబాటుకు కార్యాచరణ
- వైసిపి విస్తృత సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సుమారు ఏడాది పాలనలో చేసింది శూన్యమని, చెప్పిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేని స్థితిలో ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ చర్యలను ఎండగట్టేందుకు కార్యాచరణ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో సోమవారం వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశం కరణం ధర్మశ్రీ అధ్యక్షతన జరిగింది. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు శోభాహైమావతి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి, మాజీ శాసనసభ్యులు కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్ రాజు, చింతలపూడి వెంకటరామయ్య, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు మాట్లాడారు. బొత్స మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో కనీసం గోతులు కప్పలేని పరిస్థితుల్లో ఉందన్నారు. ఏడాది కాకుండానే లక్షన్నర కోట్ల రూపాయలు అప్పు చేశారని, ఆ మొత్తం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటుందని, నేపథ్యంలో రాష్ట్రంలో దోపిడీ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన గుడివాడ అమర్నాథ్ను పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, బొడ్డెడ ప్రసాద్, పెద్దిశెట్టి గోవింద, మల్ల బుల్లిబాబు, జాజుల రమేష్, మలసాల కుమార్ రాజా, కలగా గున్నయ్య నాయుడు, మలసాల కిషోర్, బొడ్డేడ శివ, కెయం.నాయుడు, వేగి త్రినాథ్, అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొత్స, చిత్రంలో బూడి, గుడివాడ, ధర్మశ్రీ



యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అచ్చుతాపురం : అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని వర్ధమాన్ పరిశ్రమలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరిశ్రమ గేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ అధిస్తాన్‌లోని వర్ధమాన్ పరిశ్రమలో వేతనాలు పెంచకుండా 12 సంవత్సరాలుగా శ్రమ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. పరిశ్రమ యజమాని రాకేష్ వినీత్ కార్మికుల్ని వేధింపులకు గురిచేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓవర్ టైం పనిచేసిన కార్మికులకు భోజనం, రవాణా వంటి సదుపాయాలు కల్పించాలని, సెలవులు, ఉద్యోగ భద్రత, నెలకు రెండు గంటలు పర్మిషన్, స్కూల్ పిల్లలకు బ్యాగులు, స్కాలర్ షిప్‌లు, యూనిఫామ్ మెటర్నిటీ వంటి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పిజిఆర్ఎస్ అర్జీలపై సకాలంలో చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో వచ్చే అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని, అర్జీకి సరైన వివరణతో సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్, జెసి ఎం.జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యనారాయణరావు అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీల పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పెండింగు అర్జీలపై శాఖల వారీగా సమీక్ష చేశారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డులో గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని బిఎన్ రోడ్లో బంగారు మెట్టి జంక్షన్ సమీపంలో రోడ్డుపై గుంతలను సోమవారం మట్టి, క్రషర్ బుగ్గితో పూడ్చారు. జెసిబితో రోడ్డుపై గుంతలను సరి చేశారు. అనంతరం మట్టి, క్రషర్ బుగ్గి వేసి చదును చేసి రోలింగ్ చేశారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం పంచాయతీ పరిధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన జనసేన కార్యకర్త తేజను జనసేన నాయకులు సోమవారం పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, బైలపూడి దేవుడి బాబు, గండి దుర్గాప్రసాద్, బంతి కోళ్ల పద్మ, తాటిపాముల శేఖర్, జెట్టి ప్రసాద్, పల్లి మంగరాజు, కాపు శెట్టి ప్రసాద్, బండారు శ్రీను, వాకాడ తేజ పాల్గొన్నారు.

డిఎస్‌సి స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఉపాధ్యాయ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన మనోవిజ్ఞాన శాస్త్రం మెటీరియల్స్‌ను సోమవారం జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంత డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ కావాలని లక్ష్మణరావును కోరగా ఆయన వెంటనే 100 పుస్తకాలను పంపించారని తెలిపారు. కష్టపడి చదివి డిఎస్‌సిలో ఎంపిక కావాలని కోరారు. మెటీరియల్ కావలసిన వారు 9494187980 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెవివి నేతలు

అంగన్వాడీ కార్యకర్తపై వేధింపులకు పాల్పడుతున్న సిడిపిఒ, రావాడ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-పరవాడ

అంగన్వాడీ కార్యకర్తపై వేధింపులకు పాల్పడుతున్న సబ్బవరం ఐసిడిఎస్ సిడిపిఒపైనా, పరవాడ మండలం రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడుపైనా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన కిశోర వికాసం కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్త యొక్క తప్పులేకపోయినా, ఆమెకు షోకాజ్ నోటీసు ఇచ్చి వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. కూటమిలో రాజకీయ ఆధిపత్యం కోసం అంగన్వాడీ కార్యకర్తకి ఐసిడిఎస్ సిడిపిఓ ద్వారా మెమో జారీ చేయించి, ఆ మెమో కాపీని సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడుకు సిడిపిఓ పంపించడం, దాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి మానసికంగా అంగన్వాడీ కార్యకర్తను వేధించడం దుర్మార్గమన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఏ విధమైన విచారణ లేకుండా మెమో జారీ చేయడం, ఆ మెమో కూడా అంగన్వాడీ వర్కర్‌కు ఇవ్వకుండా సర్పంచ్‌కు అందజేసి రాజకీయ వేధింపులకు కారణమైన సిడిపిఓపైనా శాఖాపరమైన విచారణ చేసి ఆమెను సస్పెండ్ చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు

కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.దేవి, ఎం. అమ్మాజీ, రత్నం, వెంకటలక్ష్మి, పార్వతి, రాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్, తాగునీరు, రహదారి సౌకర్యాల కోసం

కలెక్టరేట్ వద్ద పివిటిజిల ఆందోళన



ఆందోళన చేస్తున్న పివిటిజి గిరిజనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి, పంచాయతీలో శివారు కోక్కులుబంద, జారురాయి కొత్తవలస తదితర పివిటిజి గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, రహదారి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆయా గ్రామాల గిరిజనులు తలపై అడ్డాకుల టోపీలు పెట్టుకొని వినూత్నంగా కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం పబ్లిక్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు కావస్తున్నా నేటికీ విద్యుత్ సౌకర్యానికి నోచుకోకపోవడం చాలా బాధాకరమని, వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. మదనగరువు, కోక్కులుబంద, జారురాయి కొత్తవలస, వంతువానిపాలెం తదితర కొండపై ఉన్న పివిటిజికి చెందిన కొందు తెగ గిరిజనులకు మంచినీటి సౌకర్యం లేక ఊటగెడ్డ నీటినే తాగి మలేరియా, డెంగీ, అతిసార వంటి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా తక్షణమే ఇంటింటికి కుళాయిలు కల్పించాలని కోరారు. వంతువానిపాలెం కొండపైన ఉన్న గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు బోయిన రాము, పాంగి రామన్న, పాంగి నరసింహారావు, పాంగి గంగులు, కిల్లో శివరాజు, కిల్లో తులసి, పాంగి కన్నబాబు, ఇతర గిరిజనులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ రెవెన్యూ పరిధి సర్వే 418లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి సోమవారం రెవెన్యూ యంత్రాంగం వారు వెళ్లి పరిశీలించారు. ఈ ప్రాంతంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై 'కొండలు కరిగి పోతున్నాయి' అనే శీర్షికన సోమవారం ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. సర్వే నెంబర్ 418లో అక్రమంగా గ్రావెల్ తవ్విన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గ్రావెల్ తవ్విన వారిని గుర్తించి వారిపై పోలీస్ కేసులు పెట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఆర్వో సాయికిరణ్ తెలిపారు.



గ్రావెల్ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విఆర్ఒ

పూడిమడక తీరంలో చేపలు మృత్యువాత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పరిశ్రమలో విడుదల చేసే రసాయనక వ్యర్థ పదార్థాలు సముద్రం నీటిలో కలవడంతో చేపలు మండలంలోని పూడిమడక సముద్ర తీరంలో చేపలు మృత్యువాత పడ్డాయి. ఎపి మత్స్యకార సంఘం నాయకులు చేపల ప్రతినిధి సోమవారం ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల కాలుష్య వ్యర్థాల వల్ల చేపలు చనిపోతుండడంతో మత్స్యకారులు ఉపాధి ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎన్నిసార్లు కలెక్టర్‌కు, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులకు, మత్స్యశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని తాతయ్య డిమాండ్ చేశారు.



చనిపోయిన చేపలు

వృద్ధులకు గుర్తింపు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక వివి.రమణ రైతు భారతిలో సోమవారం వయోవృద్ధులకు డిజిబుల్ అసిస్టెంట్ ద్వారా గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. సోమవారం జరిగిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా సమావేశంలో ఆయన గౌరీ పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు విల్లూరి రాము, నోబుల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శరగడం నూకరాజు మాట్లాడారు. సోషల్ వెల్ఫేర్ కార్యాలయం నుండి మంజూరైన గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు(కెప్టెన్), డాక్టర్ నూకరాజు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల త్రినాథ, బుద్ధ తాతారావు, ఆడారి అప్పారావు, కొణతాల వెంకట అచ్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో సతీష్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-చోడవరం : యోగ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో 40 నుండి 55 సంవత్సరాల విభాగంలో చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్ర గురువు పుల్లేటి సతీష్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. జూన్ 6, 7, 8 తేదీల్లో పశ్చిమ బెంగాల్ కలకత్తాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి, అనకాపల్లి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తానని తెలిపారు. యోగ గురు సతీష్‌ని పసుమర్తి అశోక్, డాక్టర్ బంగారు కృష్ణ, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, రాయి సూర్యనారాయణరెడ్డి, అప్పారావు, పసుమర్తి గుప్తా, యోగ టీచర్ బోగవిల్లి గణేష్, కొట్టాపు హరి కిరణ్ అభినందించారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా రాపేటి రాము

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నల్లరేగులపాలెం గ్రామానికి చెందిన రాపేటి రాము వైసిపి అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. పార్టీ పెందుర్తి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ బిసి విభాగం నియోజకవర్గం అధ్యక్షులుగా ఎన్నికైనట్లు సోమవారం ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామును పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు అమరనాథ్‌కుకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల అపురూప కలయిక సోమవారం ఘనంగా నిర్వహించారు. 19ఏళ్ళ తర్వాత సుమారు 70 మంది విద్యార్థులు ఒకచోట కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను గౌరవంగా సత్కరించారు. సత్కార గ్రహీతల్లో తెలుగు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, కామేశ్వరి, ద్వీప సుందరి, హేమ శైలజ, సైన్స్, గణితం టీచర్లు సూర్యనారాయణ, ఆర్ఎస్ రాజు, హిందీ ఉపాధ్యాయులు లలిత ఉన్నారు. అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆహ్లాదంగా గడిపారు.

నూతన సిఐను కలిసిన కూటమి నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం పోలీస్ స్టేషన్ సిఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును సోమవారం బాటజంగాలపాలెం గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపి కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛము అందజేసే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు వనం సత్యనారాయణ, మురకాడ వీర వెంకటప్పలరాజు, మాజీ సర్పంచ్ కాపుశెట్టి నరసింహం, కాపుశెట్టి వెంకట్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు అన్యాక్రాంతం

- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన భవనాలు అన్యక్రాంతమవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదురుగా సీతారామరాజు నగర్ కాలనీలో గతంలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన మహిళా మండలి భవనం నాటి వైయస్సార్ ప్రభుత్వంలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రానికి ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి అద్దె చెల్లించకుండా నాడు అప్పగించారు. నాటి నుంచి నేటి వరకు మీసేవ నిర్వాహకుల ఆధీనంలోనే భవనం ఉంది. ఖరీదైన భవనంతో పాటు విలువైన స్థలం ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉండడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ భవనం స్వాధీన పరచుకొని కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా కుట్టు మిషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు.



ఆధార్ కేంద్ర భవనం



మహిళా మండలి భవనం

తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో తహసిల్దార్ నివాసం ఉండేందుకు నిర్మించిన క్వార్టర్ బిల్డింగ్ ఆధార్ సెంటర్ పేరుతో ఓ ప్రైవేటు వ్యక్తి స్వాధీన పరుచుకున్నారు. సదరు భవనానికి ప్రభుత్వానికి ఎటువంటి అద్దె చెల్లించకుండా గడిచిన ఐదు సంవత్సరాలుగా వినియోగించుకుంటున్నారు. అంతేకాదు ఇక్కడ నడుస్తున్న ఆధార్ సెంటర్లో చిన్నారులకు ఉచితంగా ఆధార్ నమోదు చేయవలసి ఉండగా రుసుము తీసుకుంటున్నట్లు తెలిసింది. విలువైన ప్రదేశంలో ఉన్న భవనాన్ని ఉచితంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించ డంతో పలువురు పలు విధాలుగా విమర్శిస్తున్నారు,

మండల కేంద్రం ప్రధాన కూడలి వద్ద పంచాయతీ నిధులతో నిర్మించిన బస్సు షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించారు. రెండు దశాబ్దాలుగా ఆక్రమణ పాల య్యింది. ప్రస్తుతం ఆ బస్సు షెల్టర్లో కాఫీ హెూటల్, స్వీట్ స్టాల్ నడుపుతున్నారు. పలుమార్లు అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించేరే గాని సరైన చర్యలు చేపట్టలేదు. విలువైన ప్రభుత్వ భవనాలు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు చోద్యం చూడడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి విలువైన భవనాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గ్రంథాలయాల్లో పలు రకాల పోటీలు



చీడికాడలో ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చీడికాడ:స్థానిక శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రవర్తనపై వివరించారు. విద్యార్థులకు కథలు చదివి వినిపించారు.విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థిని కామిరెడ్డి భవిత శ్రీ ప్రథమ బహుమతి, రెండవ బహుమతి గౌతమ్ గెలుపొందారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగా చేయించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ మాట్లాడుతూ, యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.

నర్సీపట్నంటౌన్: సమ్మర్ ఒరియం టేషన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో క్రీడలు, వ్యాయామం పై వ్యాయామ విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభాకర్ విద్యార్థిని విద్యార్థులకు సూచనలు చేశారు. క్రీడలు ఆడటంతో మానసిక మనోధైర్యాన్ని పెంచుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమార్ రాజా, ఎంవిజే అప్పారావు నీతి కథలను వినిపించారు. ఎత్తుకు పై ఎత్తు కధను చదివి వివరించారు. రిసోర్స్ పర్సన్ కె.కృష్ణవేణి స్పోకెన్ ఇంగ్లీష్ పదాలను వరించారు. రిసోర్స్ పర్సన్ నరసింహామూర్తి పిల్లలకు ధ్యానం, యోగ ముద్రలు వేసి చూపించారు.



నర్సీపట్నంలో యోగా చేయిస్తున్న టీచర్

నేడు క్విజ్ పోటీ ఉంటుందని గ్రంధాలయధికారిణి పి.దమయంతి తెలిపారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో సోమవారం జాతీయ సేవా పథక వలంటీర్ జ్యోతిర్మయి చిన్నారులకు ఆటలను నేర్పారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ ఇంజినీర్ సంజీవ్ హేమంత్ హాజరై మాట్లాడుతూ, గొప్ప నాయకులుగా తయారవ్వాలంటే భావ ప్రకటనా నైపుణ్యాలు ఎంతో అవసరం అన్నారు. గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలి

. **ప్రజాశక్తి -నక్కపల్లి:**ప్రభుత్వ అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలో నిరసన చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి వెంకటపతి రాజు మాట్లాడారు. విద్యారంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డిఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు వై కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కేకేఎల్ఎన్ ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్లు డి కొండలరావు, పి గణేష్, కె శ్రీనివాసరావు, యూనియన్ ఐదు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ కె రామ్ రహీమ్, శ్రీనివాసరావు, కృష్ణ, సిహెచ్ అప్పలరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు సోమవారం ఎపిటిఎఫ్ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రినాధరావు మాట్లాడుతూ, ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు ఉండే విధంగా ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు నూకరాజు, సత్యనారాయణ, దొర, దాసు, వర్మ పాల్గొన్నారు.



నక్కపల్లిలో ఆందోళన చేపడుతున్న టీచర్లు

చోడవరం : పభుత్వ విద్యను పోరాటాల ద్వారానే కాపాడుకోవాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చోడవరం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేయడానికి చూస్తోందని, పాఠశాలల కుదింపు, వంటివి చేపడుతుందని పేర్కొన్నారు.

అనకాపల్లి : పాఠశాల విద్యా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. 12వ పిఆర్సి కమిషన్ వెంటనే నియమించి, ఐ ఆర్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎల్టిఎస్ ప్రెసిడెంట్ సిహెచ్ రామర్మృష్ణ, ఏపీ సిపిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అప్పలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు వై. శ్రీనివాస్, మండల అధ్యక్షులు కొణతాల గణేష్, జిల్లా కార్యదర్శి డి.నూకేష్, మొసిస్ బేగం, సూర్యనారాయణ, కిరిటి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉమా ప్రసాద్

అన్నదాత సుఖీభవపై అవగాహన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురం గ్రామంలో వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ ద్వారా అర్హత ఉన్న ప్రతీ రైతుకు పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులకు సంవత్సరానికి మూడు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం 14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ 6 వేలు కలిపి 20 వేలు అందించనున్నట్లు తెలియజేశారు. వెబ్ లాండ్‌లో వున్న రైతులు అన్నదాత సుఖీభవ పోర్టల్ ద్వారా సంబంధిత ఆర్ ఎస్ కె సిబ్బంది క్షేత్ర స్థాయిలో ధ్రువీకరించి తర్వాత వ్యవసాయ అధికారి, తహసీల్దార్ లాగిన్‌లో ఆమోదించడం జరుగు తుందన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో ధ్రువీకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, వ్యవసాయ సహాయకులు సురేంద్ర,రైతులు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలి

-మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్, నర్సీపట్నం రూరల్: మండలంలోని వేములపూడి పంచాయతీకి చెందిన బండారు అప్పన్న టిడిపి కార్యకర్తల దాడిలో చనిపోగా ఆ కేసును మాఫీ చేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 11 రాత్రి సమయంలో అప్పన్న సి. సి. రోడ్డు పై అపస్మారక స్థితి లో పడిపోయి గాయాలతో ఉండగాకుటుంబ సభ్యులు గమనించి అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సిబ్బంది చూడగా మృతి చెందినట్లుగా నిర్ధారించారని తెలిపారు. రూరల్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని, దర్యాప్తులో నాలుగు నెలలు అయినప్పటికి ఇంతవరకు ఎటువంటి పురోగతి కనిపించలేదని అన్నారు. ఈ కేసుకు సంబంధించి పోస్టుమార్టం రిపోర్టులో మల్టిపుల్ ఇంజురీస్‌గా నమోదు చేసారని తెలిపారు. అప్పన్న శరీరం పై గాయాలు చూస్తే ప్రమాదవశాత్తు జరిగింది కాదనే అనుమానాలకు బలమైన ఆధారంగా నిలుస్తుండటంతో దాడి చేయడంతోనే చనిపోయినట్లు గ్రామంలో అనుమానాలు వ్యక్తం అయ్యాయన్నారు. ఈ క్రైమ్ లో అధికార పార్టీ నాయకులు ప్రేమయం వుందని విమర్శించారు. కొంతమంది అధికార పార్టీ నాయుకుల సహకారంతో నేరస్తులను తప్పిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకుని ఈ కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగే విధంగా చూడాలన్నారు. ఈ విషయమై ఎస్‌పికి ఫిర్యాదు చేశామన్నారు.

నేడు హోం మంత్రి అనిత పర్యటన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ఈనెల 6న మంగళవారం హెూం మంత్రి అనిత కేజీబీవీ పాఠశాల అసంపూర్తి భవనానికి శంకుస్థాపన చేయనున్నారు, ఆ మేరకు అధికారులు, నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గడిచిన దశాబ్ద కాలంగా అసంపూర్తి భవనంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు.



బంగారు పతకాలు అందుకుంటున్న నాగజ్యోతి

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి ప్రతిభ

- బంగారు పతకాలు కైవశం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటకు చెందిన పివిఎం.నాగజ్యోతి నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు సాధించింది. కేరళలోని ఎర్నాకులం లో ఈ నెల 3, 4, వ తేదీలలో జరిగిన 4వ నేషనల్ పాన్ ఇండియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ -2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళా విభాగంలో ఆమె పాల్గొని బెంచెస్, స్క్వాట్, డెడ్ లిఫ్ట్ విభాగాలు మూడింటిలోనూ, ఓవరాల్ ఛాంపియన్షిప్ లోనూ కలిపి మొత్తం నాలుగు బంగారు పతకాలు సాధించింది. ఈ పతకాలను దీపుదేవ్ (ప్రెసిడెంట్), వి ఎన్ షాజీ(మిస్టర్ ఇండియా టైటిల్ విన్నర్) చేతుల మీదుగా ప్రదానం చేసారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ నేషనల్ స్థాయి లో నాలుగు గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పతకాలు సాధనకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.


షాపు వద్ద ఉన్న కాలువపై లేని పలకలు

ప్రమాదకరంగా మురుగునీటి కాలువ

ప్రజాశక్తి - కొత్తకోట: మేజర్ పంచాయతీ కొత్తకోట లో మూడు రోడ్లు సెంటర్లో కోటగాంధీ షాపింగ్ కు సమీపంలో ఉన్న మురుగు నీటి కాలవ ప్రమాదకరంగా మారింది. ఈ మురుగునీటి కాలువపై సిమెంట్ పలకలు లేక పోవడంతో అటుగా వెళుతున్న వారు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలు గా పంచాయతీ పాలకులు నిర్లక్ష్యం గా వదిలేయడంతో నిత్యం రద్దీ గా ఉండే ఈ ప్రదేశంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనన్న భయం పలువురు పాదచారులు, వాహనదారులను వెంటాడుతోంది. అక్కడే స్వీట్స్, ఇతర తిను బండారాలు కొనుకోవడానికి నిత్యం మహిళలు, వృద్ధులు తిరుగుతూ ఉంటారు. ఆ కాలువలో పడితే తీవ్ర గాయాలు అయ్యే అవకాశం ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి కాలవ పై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలనీ కోరుతున్నారు.


బోరు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: లోతుగడ్డ జంక్షన్ సమీపంలోని శ్మశాన వాటికకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేయనున్న బోరు నిర్మాణానికి జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్మశాన వాటికల్లో పర్యావరణ పరిరక్షణకు,శుభ్రత నిర్వహణకు నీటి సౌకర్యం ఎంతో అవసరమన్నారు.

వితంతు పింఛన్ల మంజూరులో మెలిక

▸2023 డిసెంబర్ 1 నుండి 2024 అక్టోబర్ 31వ తేదీ మధ్యకాలంలో భర్త మరణిస్తేనే అర్హత
▸భారంగా మారిన కుటుంబ పోషణ ▸అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వితంతు (స్పౌజ్) పింఛన్ల మంజూరుకు ఇచ్చిన మెమో వలన భర్త చనిపోయిన కొంతమందికి పింఛన్లు వచ్చే అవకాశం లేక వారంతా ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా గత ప్రభుత్వ పాలనలో ఏడాదిన్నర కాలం పాటు కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. భర్తలు చనిపోయిన వారి స్థానంలో భార్యలకు పింఛన్లు సైతం మంజూరు చేయలేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఈ పాత పింఛన్ల జోలికి పోలేదు. అయితే 2024 నవంబర్ ఒకటో తేదీ నుండి భర్తలు మరణించిన వారికి స్పౌజ్ కోటాలో పింఛన్లు ఇవ్వడంతో నవంబరు నుంచి మార్చి వరకూ కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్



శాఖ ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 1 నుండి 2024 అక్టోబర్ 31వ తేదీ మధ్యకాలంలో పింఛనుదారులు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయాలని మెమో విడుదల చేసింది. 2023 డిసెంబర్ 1వ తేదీకి ముందు భర్తలు చనిపోయిన భార్యలకు ఈ స్పౌజ్ పింఛన్లు ఇవ్వడం లేదు. 2023 డిసెంబర్ 1కు ముందు చనిపోయిన పింఛనుదారులు మండలంలో సుమారు 50 నుండి 60 మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన మెమోతో వీరి భార్యలకు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసే అవకాశం లేదు. దీంతో భర్తలు చనిపోయిన వీరంతా పోషణ, వైద్యం వంటి వాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2023 డిసెంబర్ 1వ తేదీకి ముందు భర్తలు చనిపోయిన వారికి కూడా వితంతు పింఛన్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాను

నా భర్త జెర్రిపోతుల అప్పలనాయుడు అనారోగ్యంతో 2023 జులై 10వ తేదీన మరణించారు. సుమారు రెండేళ్లు కావస్తున్నా నాకు వితంతు పింఛను మంజూరు చేయలేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా, సచివాలయానికి వెళ్లి సంప్రదించినా మీపేరు రాలేదంటున్నారు. రెండేళ్లగా పింఛను కోసం ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వం స్పందించి నాకు పింఛన్ మంజూరు చేయాలి.



- జెర్రిపోతుల ఘాటీలమ్మ,
వితంతువు, దిబ్బిడి

బడా కంపెనీలకు అప్పనంగా భూముల కేటాయింపు

-సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇల్లు కేటాయించకుండా, బడా పెట్టుబడిదారులు, తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ప్రభుత్వం భూమి కేటాయించడం సరికాదని సిఐటియు సీనియర్ నాయకులు వై. రాజు విమర్శించారు. సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డులో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం భూమి కేటాయించకుండా, టిడిపి కార్యాలయం కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించుకోవడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు, టాటా వంటి కంపెనీలకు ఎకరాకు 99 పైసల చొప్పున భూమిని అప్పనంగా కట్టబెట్టడం, ఇటీవల కేవలం రెండు నెలల క్రితం స్థాపితమైన ఉర్సా అనే కంపెనీకి 56 ఎకరాలను అదే ధరకు కేటాయించడం దారుణమన్నారు. పేద ప్రజలు వివిధ స్కీముల ద్వారా ఇళ్ల కోసం అర్జీలు సమర్పించినప్పటికీ, ప్రభుత్వం వారి అవసరాలను పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కాలం తీసుకుంటున్న ప్రభుత్వం, తమ పార్టీ కార్యాలయం కోసం మాత్రం యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ భూమిని కేటాయించుకోవడం సిగ్గుచేటని తీవ్రంగా ఆరోపించారు. బడా కంపెనీలకు కేటాయించిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు


నిరసన చేపడుతున్న సిఐటియు నేతలు

ఇష్టానుసారం భూమి కేటాయింపులు చేయకుండా,అర్హులైన పేదలందరికీ ఇళ్ళు,ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్, అప్పలరాజు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: క్రీడల అభివృద్ధికి జీవీఎంసీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, క్రీడాకారులకు తన సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తానని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం పెందుర్తి లోని మేయర్ స్వగృహంలో విశాఖ నగరానికి చెందిన 13 సంవత్సరాల అంతర్జాతీయ క్రీడాకారిణి శ్రీ సాహితీ రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించినందుకు మేయర్ ఆమెను అభినందించారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరం క్రీడలకు ఎంతో అనుకూలమైనదని ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో వారి ప్రతిభను చాటుకున్నారని అలాగే శ్రీసాహితి రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. శ్రీసాహితి కు తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని, జీవీఎంసీ తరపున సహాయ సహకారాలు క్రీడలకు అందిస్తానని, విద్యార్థులు నగరంలో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించి


క్రీడాకారిణికి సర్టిఫికెట్ను ఇస్తున్న మేయర్

విశాఖ నగర కీర్తిని మరింత పెంచి నగరానికి ఘనతను సాధించి మంచి పేరు ప్రతిష్టలను తేవాలని తెలిపారు.

కార్మికులకు ఈ - శ్రమ్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: కార్మికులందరికీ ఈ శ్రమ్ కార్డులు జారీ చేయాలని, తద్వారా కార్మికుని మరణంతో వారి కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోశా లభిస్తుందని జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ చైర్మన్ ఎ.రాము కార్మిక శాఖను ఆదేశించారు. సోమవారం పాడేరు కోర్టు ప్రాంగణంలో కార్మికులు, యజమానులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో చైర్మన్ పాల్గొని వారికి ఈ శ్రమ్ కార్డులతో లభించే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జ్ మాట్లాడుతూ, ఎన్ఆర్ఇజిఎస్ వేతనదారులు, భవన నిర్మాణ రంగంలో కార్మికులు, ఇతర సంస్థలు, దుకాణాలలో పని చేస్తున్న వారు ఈ శ్రమ్ కార్డులను పొందాలని వివరించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు జడ్జి చేతుల మీదుగా కార్డులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో చోడవరం కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ, పోలీసు, ఎక్సైజ్ సిఐలు డి.దీనబంధు, టివిఎస్ఎన్ ఆచారి, ఎస్ఐ కేశవరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. రమేష్, బార్ అసోషియేషన్ అధ్యక్షులు టి.ప్రసాద్ నాయుడు,తదితరులు పాల్గొన్నారు.